క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా


ఎమ్మెల్యే నానిని కలిసిన వలంటీర్లు

ఏలూరు టౌన్: ఏలూరు 13వ డివిజన్ వెంకటాపురం–4 సచివాలయం పరిధిలోని 11 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారంతా ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా అమల్లోకి తెచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో సేవలు అందించిందన్నారు. వలంటీర్లపై టీడీపీ, జనసేన నేతలు నీచమైన కుట్రలు చేస్తున్నారని వారికి ప్రజలే బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర, పార్టీ నేతలు ఉన్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు


నగరేశ్వర స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ గంగ, వింధ్య వాసిని సమేత శ్రీ నగరేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19న ప్రారంభమైన స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలు, అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉత్సవ పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి స్వామి వారికి, అమ్మవార్లకు పవళింపు సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 107 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 63 మందికి 59 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మరో నలుగురు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎల్ఈడీ 1వ సెమిస్టర్ పరీక్షకు 50 మంది అభ్యర్థులకు 48 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.


22వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు ప్రచారం


50వ డివిజన్‌లో అవ్వతో మాట్లాడుతున్న పెదబాబు, మైబాబు


35వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ శ్రీనివాసరావు ప్రచారం


17వ డివిజన్‌లో పాము శామ్యూల్, దాసరి రమేష్‌ల ప్రచారం

వాడవాడలా ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ ప్రచారం

స్టార్ క్యాంపెయినర్లుగా పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు డివిజన్లలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. పార్టీ శ్రేణులు స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో వారికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివస్తున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేయాలని అభ్యర్థిస్తున్నారు. ఏలూరులో మళ్లీ ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టటం ఖాయమని, ఏలూరులో ఎమ్మెల్యేగా ఆళ్ల నాని అఖండ విజయాన్ని నమోదు చేయబోతున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. తమకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే మేలు జరుగుతుందనే విశ్వాసంతో ప్రజలు ఉన్నారు.

● ఏలూరు వన్‌టౌన్ 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, పార్టీ నాయకులు కోయ సత్తిబాబు ఆధ్వర్యంలో దక్షిణపు వీధి పెద్ద అమ్మవారి గుడి వద్ద నుంచి ఎమ్మెల్యే నాని గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనకు డివిజన్‌లోని ప్రజలు, నాయకులు పెద్దెత్తున స్వాగతం పలికారు.


11వ డివిజన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

● ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ విజయం కోరుతూ 22వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు ఎన్నికల ప్రచారం చేశారు.

● 50వ డివిజన్‌లో కోఆప్షన్ సభ్యుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో గవరపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. నగరంలో ప్రశాంత జీవనానికి ఎమ్మెల్యే నానిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ క్లస్టర్–3 అధ్యక్షుడు మంచెం మైబాబు, డివిజన్ అధ్యక్షుడు గవరపేట నాయకుడు, నిరంజన్‌సింగ్, మానుకొండ శ్రీను, మయూరి శ్రీను, మడుగుల నాయుడు, రాజుగారు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

● 35వ డివిజన్ కంకణాల వారి వీధిలో నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు విజయాన్ని అందించాలని కోరారు. నాయకులు పారిపిరెడ్డి నాగేశ్వరరావు, కాగని అచ్చిబాబు, గేదెల సూర్యనారాయణ, కొత్తల చంద్రశేఖర్, లాయర్ మాధవరావు, కంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● 17వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు పాము శామ్యూల్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని దొంగల మండపం రోడ్డు, బొమ్మలగుడి సందు, గాంధీ మైదానం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఏలూరు నగరాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని కోరారు. దాసరి రమేష్, మాధవ, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, శేఖర్, చంటి తదితరులు పాల్గొన్నారు.

● 16వ డివిజన్‌లో కార్పొరేటర్ జిజ్జువరపు విజయ నిర్మల, పార్టీ నాయకులు రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాని విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.

● 43వ డివిజన్‌లో పార్టీ నాయకులు జనపరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో వెల్లంకి రాజు, గొంతిన రామకృష్ణ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 6వ డివిజన్ చెంచులకాలనీలో పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

● 46వ డివిజన్‌లో ముస్లిం మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.


16వ డివిజన్‌లో కార్పొరేటర్ విజయనిర్మల, రమేష్‌ల ప్రచారం


43వ డివిజన్‌లో జనపరెడ్డి కృష్ణ, వెల్లంకి రాజు, రామకృష్ణల ప్రచారం


6వ డివిజన్‌లో పథకాల బ్రోచర్ అందిస్తున్న సుంకర చంద్రశేఖర్


46వ డివిజన్‌లో బ్రోచర్ అందిస్తున్న రియాజ్ ఆలీఖాన్, మున్నీ

నూకాలమ్మ హుండీల ఆదాయం రూ.2.22 లక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ ఆలయ హుండీల ఆదాయం 72 రోజులకు రూ.2,22,410 లభించింది. చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరి 12న హుండీల ఆదాయం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. స్థానిక పెద్దలు, ఆలయ కమి టీ ప్రతినిధులు నక్కా నాగేశ్వరరావు, వెల్లంకి రాజు, హంసల రాజేశ్వరి, పల్లెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అప్పనవీడు శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

జగన్ హయాం.. పండుగలా వ్యవసాయం

- రైతు భరోసాతో రూ.20 కోట్లు
- బ్యాంకు రుణాల నుంచి రూ.2.50 కోట్లు
- యంత్రాల సబ్సిడీ రూ.35.66 లక్షలు
- ఏలూరు రూరల్ గ్రామాల్లో 2,226 మందికి లబ్ధి

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తెచ్చిన మార్పులు రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాయి. సబ్సిడీపై అందించిన యంత్రాలు సాగుదారులకు దన్నుగా నిలిచాయి. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేశారు. వైఎస్సార్ రైతు భరోసా, కౌలురైతు గుర్తింపు కార్డుల ద్వారా పంట రుణాలు అందించడంతో ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. మల్కాపురం, వెంకటాపురం, మాదేపల్లి, పోణంగి, జాలిపూడి, చాటపర్రు, కాట్లంపూడి, లింగారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, చొదిమెళ్లలో ఏటా రైతులు 7,762 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ కలిపి మొత్తంగా ఏడాదికి సరాసరి 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులు లాభాల బాట పట్టారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.20 కోట్లు అందించింది. టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే, సీఎం జగన్ వ్యవసాయాన్ని పండుగ చేసి చూపారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు, విత్తనాలు

ఏలూరు మండల రూరల్ గ్రామాల్లోని 2,226 మంది రైతులకు ప్రభుత్వం హక్కుపత్రాలు (సీసీఆర్‌సీ) అందించింది. వీరిలో 820 మంది రైతులకు ప్రభుత్వమే సొంత పూచీకత్తుతో పలు బ్యాంకుల ద్వారా రూ.2.50 కోట్లు పంట రుణాలు అందించింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో 2,200 మంది రైతుల వ్యక్తిగత ఖాతాల్లో సుమారు రూ.20 కోట్లు జమైంది. వ్యవసాయ యాంత్రీకరణ పేరుతో రైతులను సంఘాలుగా ఏర్పాటుచేసి పలు రకాల యంత్రాలను సబ్సిడీపై అందించారు. 2021–22, 2022–23 సంవత్సరాల్లో మొత్తంగా 12 గ్రూపుల్లో పదుల సంఖ్యలో రైతులు రూ.35.66 లక్షల సబ్సిడీ పొందారు. ఇందులో ట్రాక్టర్లు, పిచికారీ యంత్రాలు, టార్పాలిన్లు ఉన్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు 140 క్వింటాల నాణ్యమైన వరి విత్తనాలు రైతులకు కేజీకి రూ.5 చొప్పున సబ్సిడీపై రైతులు పొందారు. రైతులు రూ.21.81 లక్షలు ఖరీదు గల విత్తనాలు కొనుగోలు చేశారు. నాణ్యమైన 1061, 1318, స్వర్ణ రకాల విత్తనాలు అందుకోవడం వల్ల రైతులు అధిక దిగుబడి సాధించారు.


పాలగూడెంలో వరి దిగుబడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషా


మల్కాపురం పంట చేలో డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)


చొదిమెళ్ల ఆర్బీకే కేంద్రంలో రైతులకు ఎరువులు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

40 బస్తాల దిగుబడి సాధించాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి మంచి సాయం అందించింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన రైతు భరోసా పథకం, కౌలురైతు కార్డుల ద్వారా రుణాలు పెట్టుబడికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఆర్బీకే కేంద్రం నుంచి సకాలంలో విత్తనాలు, ఎరువులు సైతం తెచ్చుకున్నాం. కష్టకాలంలో ఆదుకుంది. ఏటా ఎకరానికి 40 నుంచి 45 బస్తాల దిగుబడి సాధించాం. చాలా సంతోషంగా ఉంది.

– వేమూరి మెహర్‌బాబా, చొదిమెళ్ల

యాంత్రీకరణపై అవగాహన



రైతు భరోసా కేంద్రాల వల్ల సిబ్బంది నేరుగా క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. డ్రోన్స్, యంత్రాలతో వ్యవసాయానికి సాంకేతికత తోడైంది. డ్రోన్ల ఉపయోగంపై రైతులకు శిక్షణ ఇచ్చాం. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. సాగు లాభదాయం కావడంతో వ్యవసాయంపై రైతుల ఆలోచనల్లో మార్పు వచ్చింది.

– ఎ.జీవనసంధ్య, ఎంపీఓ

ఏలూరు త్రీటౌన్‌లో ఏసీబీ దాడి

- రూ.50 వేలు తీసుకుంటూ పట్టుబడిన కానిస్టేబుల్
- ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు

ఏలూరు టౌన్ : ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ 420 కేసుపై 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చేందుకు ఒక రైల్వే ఉద్యోగిని పోలీసు అధికారులు రూ.2 లక్షలు డిమాండ్ చేయగా, గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏలూరు ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో వల పన్నిన అధికారులు కానిస్టేబుల్‌ను డబ్బులు తీసుకుంటూ ఉండగా, పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు శివారు వట్లూరు ప్రాంతానికి చెందిన రైల్వే ఉద్యోగి పెందుర్తి విక్టర్ బాబు ఒక 420 కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనికి 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వాల్సి ఉండగా, అతన్ని అరెస్ట్ చేసేందుకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో విక్టర్‌బాబు హైకోర్టుకు వెళ్లి తనను అరెస్ట్ చేయకుండా 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఐతే 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చేందుకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు విక్టర్‌బాబును రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. విక్టర్‌బాబు అంత సొమ్ము ఇచ్చుకోలేనని రూ.50 వేలు ఇస్తానని పోలీసుల అధికారులతో ఒప్పందం చేసుకున్నాడు. ఐనాకూడా అతని ఇంటికి పలుమార్లు పోలీసు సిబ్బంది వెళ్లి వేధింపులకు గురిచేయడంతో విధిలేని పరిస్థితుల్లో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో గురువారం రాత్రి ట్రాప్‌కు స్కెచ్ వేశారు. గురువారం రాత్రి 8.30 గంటలకు బాధితుడు విక్టర్‌బాబు ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌కు చేరుకున్నాడు. త్రీటౌన్ కానిస్టేబుల్ ఇస్సాక్‌ను సంప్రదించగా, అతను స్టేషన్ ఉన్నతాధికారులను సంప్రదించి వారి వద్ద నుంచి రూ.50 వేలు సొమ్ము తీసుకుని ప్యాంటు వెనుక జేబులో పెట్టుకున్నాడు. అప్పటికే స్టేషన్ బయట మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు దాడిచేసి కానిస్టేబుల్ ఇస్సాక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని జేబులోని నగదును కెమికల్ టెస్ట్ చేయగా, చేతులకు ప్యాంటు వెనుక జేబుకు కెమికల్ ముద్రలు లభించడంతో కానిస్టేబుల్ ఇస్సాక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ అవినీతి ఘటనపై ఇంకా ఎవరైనా అధికారులు ఉన్నారా అనే దానిపై విచారణ చేస్తున్నామని ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు ఎన్ భాస్కరరావు, బాలకృష్ణ సిబ్బంది ఉన్నారు.


ఏసీబీ దాడిలో పట్టుబడిన ఏలూరు 3 టౌన్ కానిస్టేబుల్ ఇస్సాక్

మేడేను ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మేడే పోస్టర్‌ను ఆయన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజుతో కలిసి గురువారం విడదల చేశారు. కార్మిక వర్గం ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను మేడే స్ఫూర్తితో కాపాడుకునేందుకు కృషి చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా అవలంభిస్తోన్న వినాశకర విధానాల పైనా, ప్రభుత్వ రంగ పరిరక్షణకు మేడే స్ఫూర్తితో పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవీ కృష్ణారావు, భాస్కరరావు, రామలక్ష్మి, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మేడే పోస్టర్ విడుదల చేసిన నాయకులు

బీజేపీకి ఓటేస్తే ప్రతి రాష్ట్రం మణిపూరే



సదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే ప్రతి రాష్ట్రం ఒక మణిపూర్‌లా మండిపోతుందని సామాజిక రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం రాత్రి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, జన విజ్ఞాన వేదిక, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, భారత్ బచావో, చైతన్య వేదిక, పౌర హక్కుల సంఘం, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భారత దేశం వెలిగిపోతుందా అనే అంశంపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎన్ రమేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోని ఒక శాతం మంది చేతిలో 45 శాతం సంపద ఉన్నప్పటికీ పెట్టుబడులు రావడంలేదన్నారు. నిరుద్యోగం ఇతర కారణాలతో గత పదేళ్లలో 17 లక్షల మంది దేశం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల కోసమే కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తున్నారని చెప్పారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే ముందు ముందు ఎన్నికలు ఉండవని వివరించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ పౌర సంఘాలు ప్రచురించిన నయవంచన అనే పుస్తకాన్ని ప్రభాకర్ ఆవిష్కరించారు. గుడిపాటి నరసింహారావు, రిటైర్డ్ జడ్జి లక్ష్మి, ఐలు నాయకులు కట్టా సత్యనారాయణ, ఓరుగంటి శైలజ, భారత్ బచావో నాయకులు గుబ్బల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి మద్దతుగా నిలవాలి


వట్లూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. పెదపాడు మండలంలోని వట్లూరులో గురువారం ఉదయం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం కలపర్రు, వేంపాడు, కొక్కిరపాడు గ్రామాల్లో అబ్బయ్య చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు చేసిన మేలును వివరించి ఓట్లు అభ్యర్థించారు. పలు చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, కలపర్రు సర్పంచ్ వట్రపు విష్ణుతులసి కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

ఏలూరు (టూటౌన్): చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ డి. కిషోర్ సూచించారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పొందుతూ ఇటీవల పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలతో పాటు కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటూ అభివృద్ధి కావాలన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ ద్వారా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులకు మానవత జిల్లా కమిటీ ముద్రించిన డిక్షనరీలు పంపిణీ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ డీఈ పి.కొండలరావు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పాల్గొన్నారు.


విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న కిషోర్